క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గురువారం మండలంలో పర్యటించ నున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మణి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్వీనర్ మాట్లాడుతూ మండలంలో గురువారం ఉదయం 7 గంటలకు ముద్దుకుప్పం సచివాలయం పరిధిలోని చొక్కమడుగులో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు. అనంతరం మంగుంట కనుము రోడ్డుకు భూమిపూజ, కొటార్లపల్లెలో మినరల్ వాటర్ ప్లాంట్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభించ నున్నారని చెప్పారు. అలాగే 9 గంటలకు కొత్తపల్లె దళితవాడలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీల, 50 బసివిరెడ్డిపల్లి తాగునీటి బోరును ప్రారంభించి, ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయ నున్న బహిరంగసభల్లో పాల్గొంటారన్నారు. పిల్లిగుండ్లపల్లె ఎస్టీ కాలనీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

మంచి చేసిన ప్రభుత్వానికి అండగా నిలవండి



పట్టాలు అందుకున్న వారితో కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది

నగరి: మున్సిపల్ పరిధిలోని పుదుపేట నార్త్ సచివాలయ పరిధిలో ఉన్న 23, 24 వార్డుల్లో రిజిస్టరు అయిన ఇళ్ల పట్టాలను బుధవారం కౌన్సిలర్లు లబ్ధిదారులకు అందజేశారు. రెండు వార్డుల్లో 80 మంది మహిళలు పట్టాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇన్ని పట్టాలు ఇచ్చిన వారు గతంలో ఎవరూ లేరని, ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోహన్‌రాజ్, భూపాలన్, సచివాలయ అడ్మిన్, వలంటీర్లు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో మంత్రి రోజా దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ఏపీ పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా దంపతులు బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన రోజా దంపతులను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా ఆలయ ఏఈఓ ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగు పరుచుకోండి



మాట్లాడుతున్న ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు ఇస్తున్న వివిధ రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధి మెరుగు పరుచుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్ తెలిపారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘమిత్రలు, సీసీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీనిధి, ఉన్నతి, సున్నావడ్డీ పథకాల ద్వారా రుణాలు ఇస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ఆ రుణ మొత్తాలను అధిక ఆదాయం వచ్చే పనులకు పెట్టుబడి పెట్టి ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉగాది పోటీలు

చిత్తూరు కలెక్టరేట్: ఉగాది పండుగ పురస్కరించుకుని తెలుగు సంవత్సరాది గొప్పదనం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షులు తులసీనాథం నాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి తులసీనాథం నాయుడు, కళామందిరం, గంగవరం, పలమనేరు చిరునామాకు తపాలాలో ఈ నెల 30వ తేదీ లోపు పంపాలని చెప్పారు. బాగా రాసిన 50 మంది విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు.

చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా అలీ అక్బర్



చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా గంగాధరనెల్లూరు మండలం అబ్బాస్ నగర్‌కు చెందిన అలీ అక్బర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు అప్పజెప్పిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని అలీ అక్బర్ చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ముస్లిం నాయకులు ఆయన్ను అభినందించారు.

ఐక్యతకు చిహ్నం సెంగుందర్లు





మంత్రి రోజా దంపతులను సత్కరిస్తున్న సెంగుంధర్లు, కల్యాణ మండపం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- సెంగుందర్ల కల్యాణ మండపం ప్రారంభం
- నేత సామాజికవర్గ ఉన్నతినే కోరుకుంటా
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: సెంగుందర్ల ఐక్యతకు చిహ్నం చింతలపట్టెడలో నిర్మించిన సెంగుందర్ కల్యాణ మండపం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడలో ప్రభుత్వం స్థలం కేటాయించి సెంగుందర్లు అంతా విరాళాలు పోగుచేసి నిర్మించిన కల్యాణ మండపాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం హోమ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చింతలపట్టెడలో నిర్మించిన కల్యాణ మండపం పార్టీలకు అతీతంగా సెంగుందర్ల ఐక్యతను చాటుతోందన్నారు. అందరూ ఏకమై నిధులు సమకూర్చుకుని మండపం నిర్మాణం పూర్తి చేయడం గొప్పవిషయమన్నారు. సెంగుందర్ ఇంటి కోడలిగా తాను కూడా ఈ మహత్కార్యంలో పాలు పంచుకున్నానని, తమ కుటుంబం తరఫున మండపం నిర్మాణానికి రూ.5,00,616 అందించడం జరిగిందన్నారు. అలాగే మండపం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని పార్కింగ్‌కు, భోజన వసతికి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఆధునీకరణ వైపు వెళ్లండి..

స్థానికంగా ఉన్న నేత పరిశ్రమ స్థాయిని పెంచేందుకు తాను ఎంతో కృషిచేస్తున్నా, ఆధునీకరణకు వెళ్లడంలో వారిలో చోటు చేసుకున్న భయం అడ్డుపడుతోందని మంత్రి రోజా తెలిపారు. తానెప్పుడూ నేత సామాజికవర్గ ఉన్నతినే ఆశిస్తానన్నారు. ఆ వైపు అడుగులు వేయడానికి నేతన్నలు సిద్ధమైతే ఆర్డర్లు తీసివ్వడం తనవంతు అన్నారు. మంత్రి భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి మాట్లాడుతూ తాను సెంగుందర్ కులానికి చెందిన వాడినేనని, నేతలో ఒక పోగు తెగితే దానికి ఎంత శ్రమించాలో తనకు తెలుసన్నారు. సెంగుంధర్లు ఐక్యతతో చేపట్టిన ఒక మహత్కర కార్యక్రమంలో తాము కూడా పాలు పంచుకోవడం చెప్పలేని అనుభూతిని ఇస్తోందన్నారు. మన ఐక్యత ఇలాగే కొనసాగాలని, అది మరెన్నో అభివృద్ధి మార్గాలను మనకు చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, సెంగుందర్ సామాజికవర్గ పెద్దలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు



తల్లులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మజ

పుత్తూరు: చిరుధాన్యాలైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నల్లో మంచి పోషకాలు ఉన్నాయని, వీటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ కె.పద్మజ సూచించారు. బుధవారం వడమాలపేట, కాయంపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులకు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని చెప్పారు. అలాగే రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని వివరించారు. ఆహారం ఎలాంటి వంట పాత్రల్లో వండుకోవాలి ? రోజువారి ఆహారంలో ఏవీ తీసుకోవాలన్న విషయాలను తెలియజేశారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ పోషకాలు అందేవిధంగా ఐదు రంగుల్లోని కూరగాయలను తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో వంట విధానాన్ని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ కిట్‌లోని ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలు ఈనెల 23 వరకు జరుగుతాయని వెల్లడించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల పెరటి తోటల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రోజారమణి, మనీల, స్కూల్ టీచర్ నీరజ, విజయ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్ల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ద్రాక్షాయణి

గంగాధరనెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ద్రాక్షాయిణి గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్లను బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న గృహ పథకం ద్వారా లబ్ధిదారులకు ఇళ్ల మంజూరులో చిత్తూరు జిల్లాలోనే గంగాధరనెల్లూరు మండలం మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. జీడీ నెల్లూరు లేఅవుట్‌లో దాదాపు 450 మంది లబ్ధిదారులకు పట్టాలు అందించగా 95 శాతం మంది గృహాలు నిర్మించుకుని, నివసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ లిల్లీ కుమారి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గీత పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



పెనుమూరులో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు


పెనుమూరు(కార్వేటినగరం): ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కేంద్రబలగాలు, పోలీసు బలగాలతో కలసి పెనుమూరు వీధుల్లో బుధవారం కవాతు నిర్వహించినట్లు చిత్తూరు తూర్పు విభాగం సీఐ కుళాయప్ప తెలిపారు. సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు వచ్చాయన్నారు. ప్రజల్లో నమ్మకం, ఆత్మవిశ్వాసం నింపడానికి, ఎన్నికల ప్రక్రియలో అసాంఘిక కార్యకలాపాల నివారణపై ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అపోహల పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని, నిర్భయంగా ప్రజలందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందుస్తుగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ఇందులో భాగంగా పెనుమూరు, ఉగ్రాణపల్లి, సాతంబాకం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారామిలటరీ ఇన్‌చార్జి అధికారి వివేక్ బహదూర్, ఎస్ఐ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



భూ హక్కు పత్రాలతో లబ్ధిదారులు

వెదురుకుప్పం: రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. ఇటీవల మండలంలోని బ్రాహ్మణపల్లె రెవెన్యూ పరిధిలో చేపట్టిన రీసర్వే పూర్తి కావడంతో రైతులకు భూయాజమాన్య హక్కు పత్రాలను బుధవారం అందజేశారు. మొత్తం 368 మంది రైతులకు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలకు సీఎం జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం మాట్లాడుతూ 72 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు జగనన్న పరిష్కారం చూపినట్లు తెలిపారు. భూ హక్కు పత్రాలతో పూర్తి వివరాలు, స్కెచ్‌లతో సహా ముద్రించి ఉండడంతో భవిష్యత్తులో ఎలాంటి అక్రమాలు జరిగేందుకు ఆస్కారం ఉండదన్నారు. అలాగే జగనన్న కాలనీలో 11 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో మాంబేడు మాజీ సర్పంచ్ బాలకృష్టారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొజ్జారెడ్డి పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రితో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

గంగాధర నెల్లూరు: స్థానిక జెడ్పీ హైస్కూలులో 1982–83 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకుని నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యత్తులో తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి మరిన్ని సేవలు అందిస్తామన్నారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం హేమలత, ఇన్‌చార్జి హెచ్‌ఎం దినకరన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సేవలు మరపురానివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రభాకర్ రెడ్డి, లోకనాథరెడ్డి, మధుసూదన్, నిత్యానందం, రవి నాయుడు, జయచంద్ర నాయుడు, జగన్ బాబు, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మంత్రి రోజా దంపతులు



సీఎం జగన్‌కు మొక్కను అందిస్తున్న మంత్రి రోజా

నగరి: మంత్రి ఆర్‌కే రోజా ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఆయనకు లైవ్ ప్లాంట్‌ను అందించారు. నగరి నియోజకవర్గానికి సంబంధిత అంశాలపై చర్చించారు.

ఎండలు బాబోయ్ ఎండలు

- ఉదయం చలి.. మధ్యాహ్నం వేడి



తలపై చున్నీ కప్పుకుని వెళుతున్న విద్యార్థినులు

పాలసముద్రం: వాతావరణంలో మార్పుల కారణంగా మార్చి రెండో వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం వణికిస్తున్న చలి ఉండగా, మధ్యాహ్నం భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మంగళ, బుధవారాల్లో ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా ప్రజలు, ముఖ్యంగా ఇంటర్మీడియట్ పరీక్షలు రాయడానికి వెళ్లి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వేడికి విద్యార్థులు విలవిల లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల వరకు చలి వణికిస్తోంది. అనంతరం 11 గంటల నుంచే ఎండ తీవ్రరూపం దాల్చడంతో ప్రజలు ఉపశమన మార్గాలను ఆశ్రయించకతప్పలేదు.


ఫిజియోథెరపీతో అంగవైకల్యం నయం



ఫిజియోథెరపీ చేస్తున్న అనూష

పాలసముద్రం: ఫిజియోథెరపీతో అంగవైకల్యం నయం చేసుకోవచ్చని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. ఫిజియోథెరపిస్టు అనూష పాలసముద్రం భవితకేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రంలో ప్రతివారం చేస్తున్న ఫిజియోథెరపీ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ అనూష మాట్లాడుతూ ప్రతి బుధవారం భవితా కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ టీచర్ బాలాజీ, పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



పైపులైను పనులు చేయిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ బుడ్డారెడ్డి కండ్రిగలో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో ఉన్న తాగునీటి బోరు లోంచి వచ్చే నీరు వేసవిలో తగ్గుముఖం పడుతుందని గ్రామస్తులు సర్పంచ్ పుష్ప దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన సర్పంచ్ అధికారులతో చర్చించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. పంచాయతీ నిధులు రూ.2.40 లక్షలతో 390 మీటర్లు పైపులైను పనులను చేపట్టారు. అలాగే 5 వేల లీటర్ల సామర్థ్యం గల సింటెక్స్ ట్యాంకును ఏర్పాటు చేశారు.

సరస్వతీ నిలయాలకు పునరుజ్జీవం



రాణీమహల్‌ను పురావస్తు శాఖకు అప్పగిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: సరస్వతీ నిలయాలుగా విరాజిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునర్జీవం పోశారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలో నాడు–నేడు పథకం ద్వారా ఆధునీకరించిన ప్రభుత్వ పాఠశాలలు, ఆర్బీకే, సచివాలయం, సదాశివేశ్వరస్వామి ఆలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ప్రతి పేద బిడ్డ ఆంగ్లభాషలో రాణించాలన్న సదాశయంతో ప్రైవేటు పాఠశాల తరహాలో సర్కారు స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు పూరిపాకల్లా ఉంటే, నేడు కార్పొరేట్ పాఠశాలల తలదన్నేలా రూపుదిద్దుకున్నాయన్నారు.

రాణీ మహల్‌కు మహర్దశ

సంస్థానాధీశులు 400 ఏళ్ల క్రితం నిర్మించిన చారిత్రక కట్టడం రాణీమహల్‌ను చంద్రగిరి కోట తరహాల్లో ఆధునీకరించి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని తెలిపారు. అలాగే సంస్థానాధీశులు కళాఖండాలు ఉట్టిపడేలా 14 ఎకరాల్లో నిర్మించిన స్కంధ పుష్కరినిలో నీరాలి మండపం నిర్మించి, కార్వేటినగర వాసుల చిరకాల కోరికను నెరవేర్చిన ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. రాణీ మహల్‌ను పురావస్తు శాఖ రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్‌కు అప్పగించి, త్వరిగతిని ఆధునీకీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఎం పురం ఉన్నత పాఠశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను కోరగా స్పందించిన మంత్రి వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేసి, తమ స్వగ్రామం రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీపీ లత, పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయవర్మ, మండల కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, విశ్రాంత తుడా ప్లానింగ్ అధికారి కృష్టారెడ్డి, సుబ్బులురాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, చందురాజు, ధనశేఖర్‌వర్మ, శేషాద్రి, పట్టాభిరెడ్డి, లోకనాథనాయుడు, మురళీకృష్టారెడ్డి, మురగయ్య, జీజీలురెడ్డి, గోపీనాథ్, తిరుపతి డీఈఓ శేఖర్, ఎంఈఓ మనోజ్‌కుమార్, ఏఈ నాగభూషణం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన డిప్యూటీ సీఎం

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని అల్లి ఎల్లమ్మ దేవస్థానం ఆవరణలో ధర్మకర్తలు పార్థసారథిరెడ్డి, రవీంద్రారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.16 లక్షల సొంత నిధులతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని బుధవారం ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ధర్మకర్తలు తమ తండ్రి లేట్ రాజగోపాల్‌రెడ్డి (ఎక్స్ వీఎం) జ్ఞాపకార్థం సొంత నిధులతో వాణిజ్య సముదాయాన్ని నిర్మించి దేవస్థానం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని, దీని ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవాలయ పూజా కార్యక్రమాలకే ఉపయోగించడం హర్షించదగిన విషయమన్నారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం, సింగిల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబు రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం, వరదరాజులు రెడ్డి పాల్గొన్నారు.



నూతన భవనాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కమిషనర్ పోలా భాస్కర్

సచివాలయ వ్యవస్థ ఓ చారిత్రాత్మకం

మహదేవ మంగళంలో సర్పంచ్ ఉమ, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మురుగన్ మొదలియార్ ఆధ్వర్యంలో రూ. 36.80 లకలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రియ, వైస్ ఎంపీపీ హరిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, నాయకులు సురేంద్రారెడ్డి, రమేష్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ రెడ్డి, ఆర్బీకే మండల అధ్యక్షుడు బలరామరెడ్డి, నాయకులు నాయనిరెడ్డి, సర్పంచ్ హేమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్‌స్థాయి విద్యాబోధనే లక్ష్యం

కార్వేటినగరం: కార్పొరేట్ స్థాయిలో పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రూ.1.40 లక్షలతో నిర్మించిన నూతన భవన సముదాయాలను ప్రభుత్వ కళాశాలల కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌తో కలసి మంత్రి ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేసి, వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. పోలా భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి పాల్గొన్నారు.



మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

స్వేచ్ఛగా ఓటు వేయండి

నగరి: ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆర్డీఓ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మెప్మా కార్యాలయంలో ఓటు విలువపై మహిళలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తన ఓటును వేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా, నైతికంగా వారి ఓటును వేయాలని కోరారు. వారి కుటుంబ సభ్యులు కూడా ఓటు వేసేవిధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఓటరు బాధ్యతన్నారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఓటు విలువను తెలియజేసేలా మెప్మా సిబ్బంది ఉప్పుతో వేసిన చిత్రపటం ఆకర్షించింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, మెప్మా జిల్లా సమన్వయకర్త వి.బాబా, టీఎంసీ సునీత, మెప్మా సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఓట్ల కోసం టీడీపీ తాయిలాలు

- రాత్రికి రాత్రే నగదు, కుక్కర్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



రామలింగాపురంలో నగదు, కుక్కర్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్

పెనుమూరు(కార్వేటినగరం): ఓటర్లను ఆకర్షించుకునేందుకు జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి థామస్ ఓట్ల కోసం మహిళలకు నగదు, కుక్కర్లు పంపిణీ చేస్తున్నారు. చింతపెంట సచివాలయం పరిధిలోని రామలింగాపురం, గాగమ్మగారిపల్లె దళితవాడ, మాణిక్యరాయినిపల్లె దళితవాడలో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి థామస్, యుగంధర్‌తో కలసి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ప్రతి ఇంటికీ ఓ కుక్కర్, రూ. 500 చొప్పున నగదు పంపిణీ చేస్తున్నారు. దీన్ని కొందరు తిరస్కరించారు. స్థానిక టీడీపీ నాయకులు మరింత నగదు ఇస్తామని ప్రలోభాలకు గురి చేసి, బలవంతంగా అందజేస్తున్నారు. అయితే కొందరు ఎన్నికల సమయంలో ఎంత నగదు పంచిపెట్టినా, ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలను అందించిన జగనన్నకే ఓట్లు వేస్తామని తిరగబడ్డారు. ఈ ఒకసారి చంద్రబాబుకు ఓటు వేయండని అభ్యర్థించగా మూడు సార్లు నమ్మి ఓట్లు వేసి మోసపోయామని, ఇంకోసారి మోసపోయేందుకు సిద్ధంగా లేమని గట్టిగా బుద్ధి చెప్పారు.

మహిళాభివృద్ధికి సహకరిస్తాం



బహుమతులు అందుకున్న వారితో బ్యాంకర్లు

నగరి: మహిళాభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుంది అని యూనియన్ బ్యాంకు నగరి బ్రాంచ్ హెడ్ యువరాజ్, మేనేజర్ నిత్య అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని సిద్ధివినాయక సత్యసాయి ఆలయంలో సత్య ఎస్‌హెచ్‌జీ సభ్యులు నిర్వహించిన మహిళా దినోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందిస్తున్న సహకారాన్ని వివరించారు. బ్యాంకు రుణాలు పొంది గ్రూపులోని వారు చేపట్టే వృత్తి వ్యాపారాలపై ఆరాతీశారు. రుణాలు పొందడంలో ఏ సమస్యలు ఉన్నా, సందేహాలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.